పైకప్పు కుంగింది..
నాణ్యత తేలింది

నిజామాబాద్ నగరం రోటరీనగర్‌లో మురుగ కాలువపై కొద్దిరోజుల కిందట సిమెంటు, కంకర మిశ్రమంతో పైకప్పు నిర్మించారు. ఇక్కడి చౌరస్తాలో నాలుగు రోడ్లు కలుస్తాయి. ఓ మార్గం వైపు వేసిన సిమెంటు పైకప్పు కొన్నాళ్లకే కుంగిపోగా, రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులు హెచ్చరికగా చెట్లకొమ్మలను పడేశారు. కాలువ వద్ద మళ్లీ మరమ్మతులు చేయించాలని నగరపాలిక అధికారులను కాలనీ వాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

ఈ భవనం.. మహిళా శక్తికి ప్రతీక

నిజామాబాద్‌లోని కలెక్టరేట్ సముదాయం వెనుక నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం పనులు పూర్తయ్యాయి. జిల్లా మహిళా సమాఖ్య సమావేశాల నిర్వహణకు ఇప్పటి వరకు ప్రత్యేకంగా ఎలాంటి సదుపాయం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాల్లో మహిళా శక్తి భవనాలను నిర్మిస్తోంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనూ ఈ నిర్మాణాన్ని రూ. 5 కోట్లతో పూర్తిచేశారు. వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే సారి భవనాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. – న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

ఓపీకి వెళ్తే.. బీపీ పెరగాల్సిందే

★ రోగులు పెరిగినా.. సేవలు అంతంతే
★ వెల్‌నెస్ కేంద్రంలో రక్తపోటు మందుల్లేవ్

న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్య విభాగం

ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, పాత్రికేయులతో పాటు వారి కుటుంబ సభ్యులకు నిజామాబాద్ కార్పొరేషన్ భవనం వెనుక ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రం వైద్య సేవలందిస్తోంది. ఒక వైపు సొంత భవనం లేక రేకుల షెడ్డులో ఆసుపత్రిని నిర్వహిస్తుంటే, సోమవారం మినహా మిగతా రోజుల్లో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండటం లేదు. రోజురోజుకు ఓపీ పెరుగుతోంది. రద్దీ తగ్గట్టుగా ఔషధాలు లేవు. దీంతో బయటే కొనాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు.

వైద్యులు, సిబ్బంది కొరత..

వెల్‌నెస్ సెంటర్‌లో ఇన్‌ఛార్జితో పాటు ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం సంవత్సర కాలంగా ఇన్‌ఛార్జి ఒక్కరే అందుబాటులో ఉంటున్నారు. జీజీహెచ్ నుంచి రోజుకో ప్రత్యేక వైద్య నిపుణుడిని ఓపీకి పంపిస్తున్నాం అని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కానీ, ఇద్దరు, ముగ్గురు తప్ప మిగిలిన వారు ఆ వారంలో కనిపించడం లేదు. వైద్యుల పోస్టులు భర్తీచేసే అధికారం డీఎంఈకి (వైద్య విద్య సంచాలకులు) ఉంది. సదరు అధికారి ఈ సమస్యపై దృష్టి పెట్టాలి. ఫార్మసిస్టు ఒక్కరే ఉండగా, డేటాఎంట్రీ ఆపరేటర్ల కొరత నెలకొంది.

వెల్‌నెస్ కేంద్రంలో ఓపీ వద్ద కూర్చునే సదుపాయం లేక నిల్చున్న రోగులు

ఔషధాలు నిండుకున్నాయ్..

గతనెల రోజులుగా అధిక రక్తపోటు (బీపీ) మాత్రలు లేవు. మధుమేహ వ్యాధికి కూడా ఒక మాత్ర ఉంటే మరోటి ఉండడం లేదు. వెల్‌నెస్ సెంటర్‌కు ఎక్కువగా పదవీ విరమణ చేసిన వారే వస్తుంటారు. అత్యధికులకు బీపీ, మధుమేహ మాత్రలు అవసరం పడుతున్నాయి. స్టాక్ లేక కొన్ని బయట కొనాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఇవేకాకుండా క్యాల్షియం, మల్టీవిటమిన్ మాత్రలతో పాటు కొన్ని సిరప్‌ల కొరత ఉంటోంది. ఔషధాల లోటు లేకుండా ఆరోగ్యశ్రీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

బయటే నిరీక్షణ

ప్రతిరోజు 170 నుంచి 180 వరకు ఓపీ నమోదవుతోంది. ఇరుకు రేకుల షెడ్డులో దవాఖానా నిర్వహిస్తుండగా.. ఎండలకు రోగులు, సిబ్బంది ఉక్కపోత తాళలేకపోతున్నారు. లోపల వేచి ఉండేందుకు కుర్చీలు, స్థలం లేదు. ఆరుబయట చెట్లకింద నిరీక్షించాల్సి వస్తోంది. ఔషధాలు తీసుకునేచోట సీనియర్ సిటిజన్లు గోడ వెంట బారులుదీరి నిలబడాల్సి వస్తోంది. ప్రస్తుతం దవాఖానా ముందుభాగంలో నిర్మించే భవనం నిధుల్లేక అసంపూర్తిగా మిగిలింది. స్లాబ్ వేయకపోగా, మొండిగోడలు దర్శనమిస్తున్నాయి.

★ ఔషధాలు ఒకటి ఉంటే మరొకటి అందుబాటులో ఉండడం లేదు. వాటిని బయట కొనడం ఆర్థికంగా భారం అవుతోంది. గత నెలరోజులుగా బీపీ మందులు లేవంటున్నారు. వైద్యుడు 110 ఎంజీ మధుమేహం మాత్రలు రాస్తే.. 150 ఎంజీ ఉన్నాయని స్టోర్‌లో చెబుతున్నారు. - **సులోచన, వినాయక్‌నగర్**

జిల్లా లబ్ధిదారులు ఇలా..

విశ్రాంత ఉద్యోగులు	:	21,000
ప్రభుత్వ ఉద్యోగులు	:	18,000
జర్నలిస్టులు	:	800
ఓపీ (రోజుకు)	:	180

★ 'వైద్యులు, సరిపడా సిబ్బంది లేక కేంద్రం నిర్వహణ ఇబ్బందికరంగా ఉన్నమాట వాస్తవమే. ప్రస్తుతం బీపీ మాత్రలు అందుబాటులో లేవు. త్వరలోనే తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం. సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నాం'
- **డా.కృష్ణవేణి, వెల్‌నెస్ కేంద్రం ఇన్‌ఛార్జి**

ప్రసంగిస్తున్న తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత : సభలో భావోద్వేగంతో కంటతడి..

ప్రజల కష్టాలు తీర్చాలనే పార్టీ పెట్టా..

◆ 20 ఏళ్లుగా సొంతబిడ్డలా ఆదరిస్తున్నారు
◆ చక్కెర కర్మాగారాన్ని తెరిచే వరకు పోరాటం
◆ 'తెలంగాణ రక్షణ సేన' అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్ : తాను ఏ తప్పు చేయకపోయినా జైల్లో పెట్టించారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీని ప్రకటించిన తర్వాత జిల్లాకు తొలిసారిగా వచ్చిన ఆమె, నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం జరిగిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ప్రసంగించారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భావోద్వేగంతో కంటతడి పెట్టారు. 'నేను రాజకీయం చేయాలంటే ఏ పార్టీలోకైనా వెళ్లొచ్చు. కానీ తెలంగాణ ప్రజల కష్టాలు తీర్చాలనే పంతంతో నిజామాబాద్ ఆడబిడ్డగా పార్టీ పెట్టా' అని కవిత అన్నారు. పార్టీ లక్ష్యం, పాంచజన్య అంశాలను వివరిస్తూనే భారాస, కాంగ్రెస్, భాజపాలపై విమర్శలు గుప్పించారు.

తెలంగాణ వచ్చి ఏం లాభం?

'20 ఏళ్లుగా నన్ను చూస్తున్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీగా గెలిపించారు. మీరున్నారనే ధైర్యంతోనే మాట్లాడుతున్నా. ఆరు నెలలు జైలుకు వెళ్లొచ్చినా అత్తామామలు సొంత బిడ్డలా చూసుకున్నారు. అమ్మానాన్న ఇంట్లోంచి వెళ్లగొడితే.. మీకోసం వచ్చి పబ్బుతి అడుగుతున్నా. తెలంగాణ వచ్చినా ప్రజలకు న్యాయం జరగలేదు. సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పులే పుట్టిన బోధన్ గడ్డ కోడలిగా గర్విస్తూ. . ఆమె స్ఫూర్తితో ముందుకు సాగుతున్నా.

వారంతా ఒక్కటై నన్ను ఓడించారు..

భారాస తరపున ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్‌లను ఎమ్మెల్యేలుగా గెలిపించేందుకు జిల్లా అంతటా తిరిగా. ప్రశాంత్‌రెడ్డి మంత్రి కూడా అయ్యారు. వారంతా ఒక్కటై నేను ఎంపీగా గెలవకుండా చేశారు.

కవిత ప్రసంగం విని చప్పట్లు కొడుతున్న కుటుంబ సభ్యులు

ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి అవినీతికి పాల్పడి ఆస్తులు సంపాదించుకున్నారు. తెలంగాణ రాకముందు నాకు ఫ్యాక్టరీ ఉంది. ఆ తర్వాత దాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లోనూ మా పార్టీయే గెలుస్తుంది' అని కవిత ధీమా వ్యక్తం చేశారు. సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించేందుకు పోరాటం సాగిస్తానని అన్నారు.

తరలివచ్చిన జనం.. భారీగా సమీకరణ

సభకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు జనసమీకరణ చేపట్టాయి. అంతకు ముందు ఇందల్‌వాయి టోల్‌గేటు వద్ద కవితకు నాయకులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం తర్వాత మాధవనగర్ నుంచి చేపట్టిన ర్యాలీలో పాల్గొని, సభా ప్రాంగణానికి చేరుకున్నారు. పార్టీ నేతలతో పాటు కవిత భర్త అనిల్, కుమారుడు ఆదిత్య పాల్గొన్నారు.

అస్థికల నిమజ్జన కార్యక్రమంలో మద్దుకూరి సాయిబాబు, సుజన్‌కుమార్, ఇతర ప్రతినిధులు

అంత్యక్రియలు జరిపించి..
అస్థికలు గంగలో కలిపి..

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: ఎవరూ లేని అనాథల అంతిమయాత్ర గౌరవప్రదంగా సాగేలా చూస్తోంది.. 'ఇందూర్ స్వచ్ఛంద సేవా సంస్థ'. మానవతతో ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తోంది. మృతుల అస్థికలను సంప్రదాయం ప్రకారం కాశీ గంగానదిలో నిమజ్జనం చేయిస్తోంది. ఇందులో భాగంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, ఇతర ప్రతినిధులు సోమవారం కాశీలోని మణికర్ణిక ఘాట్ వద్ద 32 మంది అనాథల అస్థికలను గంగానదిలో కలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరేలా పుణ్య క్రతువులు జరిపించి, పిండ ప్రదానం చేశారు. 2015లో నిజామాబాద్ పోలీసుల సహకారంతో సంస్థ ఓ అనాథ శవానికి అంత్యక్రియలు జరిపించడం ద్వారా మానవతను చాటే క్రతువు మొదలైంది. ఇప్పటివరకు 200 మంది భౌతికకాయాలకు అంతిమ సంస్కారాలు జరిపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 168 మంది అస్థికలను ఒకే సారి గంగలో కలుపగా, యూవీ ఫౌండేషన్ సుజన్‌కుమార్, సంస్థ ప్రతినిధులు పసునూరి వినయ్‌కుమార్, ఇందూరి శేఖర్, రాజు, వెంకట్‌గౌడ్ సహకరించారు.

పిల్లలకు గంటైనా కేటాయిస్తున్నారా..?

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

☛ జిల్లాలోని ఒక మండల కేంద్రం లోనున్న గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. ఈ ఘటన మార్చి 3న జరిగింది. 'ఘటనకు రెండు రోజుల ముందే తనను చూసేందుకు రావాలని బిడ్డ ఫోన్ చేశాడని, కొన్ని పనులు చూసుకుని తర్వాత వస్తామని సముదాయించాం అని' తల్లిదండ్రులు కన్నీటిపర్యంతం అవుతున్నారు. ముందే వెళ్లినా కొడుకు దక్కేవాడేమో అని ఆ కన్నవాళ్లు ఇప్పటికీ పుత్రశోకాన్ని అనుభవిస్తున్నారు.

ఇందల్వాయి మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి నిజామాబాద్‌లోని ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రోజూ బస్సులో ఉదయం 7 గంటలకు బడికి వెళ్లడం, సాయంత్రం మళ్లీ అదే వేళకు ఇంటికి రావడం దినచర్యగా మారింది. హోంవర్క్ చేసి, భోజనం తినగానే నిద్రకు ఉపక్రమిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో అనుబంధం కొరవడి.. ఇప్పుడు అతడు ఒంటరితనానికి లోనవుతున్నాడు. చివరికి తల్లిదండ్రుల మాట వినకుండా మొండిగా తయారయ్యాడు.

తల్లిదండ్రుల నిర్లక్ష్యంతో పెరుగుతున్న ఒంటరితనం..

తల్లిదండ్రులకు పిల్లలతో కాసింతైనా సమయం గడిపేందుకు తీరిక ఉండటం లేదు. ఫలితంగా నేటి బాలలు, ముఖ్యంగా టీనేజర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. కుటుంబానికి దూరంగా హాస్టళ్లలో ఉండేవారిలో ఒంటరితనం పెరుగుతోంది. ఇల్లు, కుటుంబంపై బెంగతో నాలుగు గోడల మధ్య మనోవేదన అనుభవిస్తున్నారు. ఇటు ఇంట్లో ఉంటున్నా ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు కుటుంబ సభ్యుల మధ్య అడ్డుగా డిజిటల్ గోడలను కట్టేశాయి. తల్లిదండ్రులు, పిల్లల మధ్య క్రమంగా దూరం పెరగడం తీవ్ర నేరాలకూ దారితీస్తోందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గంజాయి, జల్సాలకు అలవాటైన పదోతరగతి విద్యార్థులు ఇటీవల నల్గొండ జిల్లాలో ప్రిన్సిపల్‌ను హతమార్చడం నేటి సమాజ పోకడలకు అద్దం పడుతోందని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోనూ బాలల్లో నేర ప్రవృత్తి ప్రబలుతోంది. గతంలో జిల్లా కేంద్రంలోని బాలల సదన్(జువెనైల్ హోం)లో బాల నేరస్థులు ఐదుగురు లోపే ఉండేవారు. ఇప్పుడా సంఖ్య 20కి పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో విద్యార్థులు..

పాఠశాల స్థాయి:	2,94,290
ఇంటర్మీడియట్:	36,963

అలా చేస్తే ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది..

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితాన్ని కాస్త పక్కనపెట్టి.. తల్లిదండ్రులు రోజూ కనీసం గంటపాటు పిల్లలతో గడపాలి. వారితో ఆడుకోవాలి. ఆ రోజు ఎలా గడిచిందని తెలుసుకోవాలి. సమస్యలుంటే పరిష్కరించే ప్రయత్నం చేయాలి. అలాకాకుండా విసుక్కుంటే పిల్లల్లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. ఎవరైనా మొండికేస్తే కలిగే నష్టాలను వివరించాలి. మార్పుకోసం ప్రయత్నించాలి. వారాంతాల్లో సరదాగా బయటకు తీసుకెళ్లాలి. అయినా సమస్య అనిపిస్తే చికిత్స చేయించాలి. - **డా.విశాల్, న్యూరో సైకియాట్రిస్ట్, జీజీహెచ్, నిజామాబాద్**

నేడు విద్యుత్తు సరఫరా బంద్

నిజామాబాద్ అర్బన్: మరమ్మతుల కారణంగా నిజామాబాద్-3 ఫీడర్ తిలక్‌గార్డెన్ ఉప కేంద్రం పరిధిలో.. మంగళవారం ఉ.9 నుంచి 11 గంటల వరకు.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగర ఏడీఈ వినోద్ తెలిపారు.

పొదుపు నిధుల భద్రతకు ఈకేవైసీ

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

'స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)' మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలను ఏటా మంజూరు చేస్తోంది. తీసుకున్న సాయంతో వ్యాపారాలు చేస్తూ పలువురు ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తున్నారు. ఇదే సమయంలో నిధులు పక్కదారి పట్టకుండా, ఖాతా వివరాలు పారదర్శకంగా నిర్వహించేలా అందరు సభ్యులకు ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ - నో యువర్ కస్టమర్)ను తప్పనిసరి చేసింది.

ఎస్‌హెచ్‌జీ సభ్యుల వివరాలు జాతీయ స్థాయిలో అందుబాటులో ఉండేలా 'లోకోస్' యాప్‌తో సంబంధిత అధికారులు అనుసంధానం చేశారు. సంఘం సభ్యులు అర్హులా.. అనర్హులా అని తెలుసుకునేందుకు ప్రతి సభ్యురాలి ఈ-కేవైసీని ప్రస్తుతం పూర్తిచేయిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 'గ్రామ సంఘం అసిస్టెంట్'లు ఇదే పనిలోనే నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 43 శాతం లక్ష్యం నమోదు చేశారు.

☛ ఇప్పటికే అన్ని ఎస్‌హెచ్‌జీల వివరాలను 'సెర్ప్' వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. సంఘాల వారీగా సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లించిన వాయిదాలు, పొందిన వడ్డీ రాయితీ, తీసుకున్న స్త్రీనిధి రుణాలు, చేస్తున్న వ్యాపారం, పొందుతున్న లాభాలు వంటివాటిని సమగ్రంగా నమోదు చేశారు. ఈకేవైసీ కూడా పూర్తయితే పొదుపు నిధులు పక్కదారి పట్టించలేరు. అనర్హులకూ రుణ లబ్ధి కలిగే అవకాశం లేదు.

మాక్లూర్‌లో యాప్ ద్వారా సభ్యురాలి ఈకేవైసీ నమోదు చేస్తున్న వీవోఏ

☛ **ఆధార్ నవీకరిస్తేనే..:** ఆధార్ వివరాలు నవీకరించకపోతే ఈ-కేవైసీ చేయడం సాధ్యంకాదు. ఫోన్‌నంబరు కూడా ఆధార్‌కు అనుసంధానమై ఉండాలి. ఫొటో సైతం ఆధార్‌లో ఉన్నదాంతో సరిపోలాలి. సమస్యలను పరిష్కరించి ఈకేవైసీని త్వరగా పూర్తిచేయాలని వీవోఏలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆదేశించారు.

వివరాలు ఇలా..

జిల్లా	మొత్తం సభ్యులు	ఈకేవైసీ పూర్తైన వారు	శాతం
నిజామాబాద్	2,06,871	1,11,452	53.88
కామారెడ్డి	1,33,148	42,052	31.58

దొంగలు.. మళ్లీ రెచ్చిపోతున్నారు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేయడంతో మూడు నెలల పాటు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల ఘటనలు తగ్గాయి. రైతులు కాస్త ఊపిరిపీల్చుకుంటున్న సమయంలో మళ్లీ దొంగలు పేట్రేగిపోతున్నారు. ఓ వైపు వాతావరణ ప్రతికూలతతో వానాకాలం పంటలు కాపాడుకునేందుకు కర్షకులు పడరాని పాట్లు పడుతున్నారు. విద్యుత్, సాగునీటి కోసం అవస్థలకు గురవుతున్నారు. ఇదే సమయంలో నియంత్రికలను ధ్వంసం చేస్తుండటంతో వారంతా తలలు పట్టుకుంటున్నారు. పంటకు నీరందక ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ నవీపేట్ మండలం అర్గుల్‌లోని ఓ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను (విద్యుత్ నియంత్రిక)ను దుండగులు ఇటీవల ధ్వంసం చేశారు.

☛ రాజంపేట మండలం బస్వన్నపల్లి శివారులోనూ ఐదు నియంత్రికలను ధ్వంసం చేసి విలువైన తీగలు, ఆయిల్ ఎత్తుకెళ్లారు. మళ్లీ కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాలో ఇలాంటి చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి.

అర్గుల్‌లో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

మూడేళ్లుగా అంతర్రాష్ట్ర ముఠాలు ఎక్కువగా పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది.

ఒక్కటి.. 15 ఎకరాలకు ఆధారం

ధ్వంసం చేసిన చోట వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించే పరిస్థితి ఉండదు. ఈ లోపు పంటలకు నీరందక తీరని నష్టం వాటిల్లుతోంది. ఒక నియంత్రిక పరిధిలో సుమారు 15 ఎకరాల వరకు సాగు చేస్తుంటారు. 25 కేవీ సామర్థ్యం అయితే ఖరీదు రూ.లక్ష పైనే ఉంటుంది. దీనికోసం 50 కిలోల రాగి తీగలు, వంద లీటర్ల ఆయిల్‌ను వినియోగిస్తారు. వీటిని పగలగొట్టడం ద్వారా దుండగులు రూ.30 నుంచి రూ.40 వేలు పోగేసుకుంటున్నారని సమాచారం. గత

నియంత్రికల ధ్వంసం ఇలా..

సం॥రం	కేసులు
2022	101
2023	132
2024	164
2025	120

బాధ్యతగా వ్యవహరిస్తేనే..

గ్రామాల్లోని ముఖ్య దారులు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పసిగట్టి పోలీసులను అప్రమత్తం చేయాలి. వాగులు, కాలువలపై సామూహికంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుంటారు. అవసరమైతే పంట చేతికి అందే వరకు ఆయాచోట్ల గస్తీ ఏర్పాటు చేసుకోవాలి. కొత్త వ్యక్తులెవరైనా ఆటోలపై పొలాల దారుల్లో తిరుగుతూ రెక్కీ చేస్తున్నారనే అనుమానం వస్తే ఠాణాలో సమాచారం ఇవ్వాలి.

ఏ ప్రాంతాల్లో బెడద ఎక్కువంటే..

☛ **నిజామాబాద్ జిల్లాలో:** ఇందల్‌వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, మెండోరా, ముప్కాల్, మోర్తాడ్, మోపాల్, బోధన్ టౌన్, రూరల్, నవీపేట్, వర్ని మండలాలు..

☛ **కామారెడ్డిలో..:** పెద్దకొడప్‌గల్, రాజంపేట్, మాచారెడ్డి, లింగంపేట్, రామారెడ్డి, తాడ్వాయి మండలాల్లోని గ్రామ శివారు పంట పొలాలు, వాగు, కాలువల ఒడ్డున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై దొంగలు కన్నేస్తున్నారు.

చేయూత పింఛన్లకు 17,466 దరఖాస్తులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం జిల్లాలో 17,466 దరఖాస్తులు అందాయి. గడువు సోమవారమే ముగియగా.. దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో ప్రభుత్వం సెప్టెంబరు 15వ తేదీ వరకు అవకాశాన్ని కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అత్యధికంగా 10,328 మంది వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరుకాకుండా ఒంటరి మహిళలు 1,845, దివ్యాంగులు 4,085, చేనేత 75, కల్లుగీత కార్మికులు 1,133 మంది దరఖాస్తులు సమర్పించారు. గడువు పొడిగించిన నేపథ్యంలో వీరి సంఖ్య పెరగనుంది. దరఖాస్తుల వివరాలను ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు. తర్వాత క్షేత్రస్థాయిలో విచారణ చేస్తారు. అర్హులకు కొత్తగా పింఛను మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

బాల్యం.. బక్కచిక్కుతోంది

చిన్నారుల్లో సరిగాలేని ఎదుగుదల

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే (నిజామాబాద్)

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. రూ.కోట్లు ఖర్చు చేసి పౌష్టికాహారం అందిస్తున్నా చాలామందిలో సరైన ఎదుగుదల కనిపించడం లేదు.

జిల్లాలోని 1,501 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మూడు నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులు 49,785 మంది ఉన్నారు. మూడేళ్లు దాటిన వారికి ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య నేర్పిస్తున్నారు. పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీ వరకు గ్రోత్ మానిటరింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరు వయసుకు తగిన ఎత్తులో, బరువుతో ఉన్నారా? అని నమోదు చేస్తున్నారు. ఈ వివరాల ప్రకారం అతి తక్కువ బరువు 1,182, తీవ్ర పోషణ లోపం 3,353, అతితీవ్ర పోషణ లోపంతో 545 మంది బాధపడుతున్నారు. వీరి ఆరోగ్య సంరక్షణపై తల్లులు దృష్టిసారించేలా నిర్వాహకులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పోషణ లోపం నుంచి చిన్నారులకు విముక్తి కల్పించేలా కేంద్రాలను మరింత బలోపేతం చేయాలి. 'న్యూట్రిషియన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం' (ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌తో ప్రయోజనాలు దక్కేలా చూడాలి.

పౌష్టికాహారం అందించి.. పర్యవేక్షించాలి..

ప్రభుత్వం ఎన్‌హెచ్‌టీఎస్‌కు అనుబంధంగా 'అనుబంధ ఆహార కార్యక్రమం(సూపర్‌వైజరీ సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం)'ను అమలు చేస్తోంది. తీవ్ర, అతితీవ్ర పోషకాహార లోపంతో బాధపడే చిన్నారుల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడంతో పాటు.. వారి ఎదుగుదల సరిగా ఉండేలా టీచర్లు ప్రత్యేక శ్రద్ధచూపాలి. బాధిత పిల్లలకు అదనపు పౌష్టికాహారం అందించి వారిని సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషిచేయాలి. ముఖ్యంగా 'బాలామృతం ప్లస్' అందించి.. అది పూర్తిగా వినియోగించేలా చూడాలి. ఇలా నాలుగు నెలల పాటు పర్యవేక్షించాలి. అయినా బరువు పెరగకపోతే నిజామాబాద్‌లోని జీజీహెచ్‌లోనున్న న్యూట్రిషన్ హెల్త్ సెంటర్‌కు రిఫర్ చేయాలి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ మెరుగుపడాలి.

WANTED

Assistant Head Master/ Head Mistress
Qualification: Trained Graduates with Fluency in English and Experience.
Interested Candidates may Contact Immediately.

ST. XAVIER'S HIGH SCHOOL
Opp: Forest Office, Varni Road, NIZAMABAD. ✆: 8639189010

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
సమాచారం అందరికీ చేరుతుందిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

నిజామాబాద్: 8008709960, 8008709958, 9963849825,
బోధన్: 8008709960, ఆర్మూర్: 8008553004
కామారెడ్డి : 8977792553, బాన్సువాడ : 8008709959

(c) eenadu

బిందు సేద్యం.. నిర్వహణే ప్రధానం

న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం

నీటి ఆదాతో పాటు మొక్కకు అవసరమైన మేరకే నీటి తడులు అందించే పద్ధతి బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్). జిల్లాలో చాలా మంది రైతులు బిందుసేద్యంతో పంటలు పండిస్తున్నారు. ఆయిల్‌పామ్, మిరప, ఉద్యానతోటలకు అవసరానికి తగ్గట్టు వినియోగిస్తున్నారు. ఈ సేద్యంతో నీటి ఆదాతో పాటు కలుపు నివారణ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు రాయితీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డ్రిప్ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఇవీ సూచనలు..

అన్ని డ్రిప్‌ల నుంచి ఒకే విధంగా నీరు వస్తుందా..? లేదా..? అనేది చూడాలి. అందు కోసం పొలంలోని కొలతారు, మధ్య, చివరి భాగాల్లోని డ్రిప్ కింద లీటరు సామర్థ్యమున్న పాత్రలను ఉంచి నీటిని సేకరించాలి. సబ్ మెయిన్ వద్ద ఉన్న కవాటాన్ని పూర్తిగా తెరచి ప్రతి డ్రిప్ నుంచి నాలుగు లీటర్లు వచ్చే వరకు

నీటిని వదలాలి. పాత్రల్లో సేకరించిన నీటిని కొలిచి వంద మీటర్ల లేటరల్ పైపుల్లో ఉన్న డ్రిప్‌ల మధ్య నీటి విడుదల 3.6శాతం కంటే ఎక్కువ తేడా లేకుండా చూడాలి. ఎక్కువ వ్యత్యాసం ఉంటే డ్రిప్‌లను శుభ్రం చేయడం లేదా మార్చాలి. డ్రిప్‌లో ప్రధానంగా పిల్లర్లు, పైపులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. శాండ్ గ్రావెల్ పిల్లర్లలో కాలక్రమేణ మట్టి, సేంద్రియ పదార్థాలు పేరుకుపోతాయి. నీటి ప్రవాహం తగ్గి డ్రిప్‌లు మూసుకుపోతాయి. వారానికి ఒకసారి బ్యాక్‌వాష్ చేసి పిల్లర్లలోని మలినాలను, స్క్రీన్ పిల్లర్లలో పేరుకున్న మురికి తొలగించాలి. పీవీసీ ప్రధాన పైపులు, సబ్ మెయిన్లు, లేటరల్ పైపుల్లో పేరుకుపోయే మట్టి, చెత్తను తీసేయాలి. ప్రతి వారం ఫ్లష్ వాల్ తెరిచి కొద్ది నిమిషాలు నీటిని వదలాలి. నల్లని లేటరల్ చివర ఉన్న ఎండ్ క్యాప్ తీసి కూడా ఫ్లషింగ్ చేయడంతో డ్రిప్‌లు మూసుకు పోవు. పైపులకు రంధ్రాలు ఏర్పడితే గూఫ్‌ప్లగ్‌లతో మరమ్మతులు చేయాలి. డ్రిప్‌లలో పాచి లవణాలు, కార్బోనేట్లు పేరుకుపోతే ఆమ్ల లేదా క్లోరిన్ ద్రావణంతో శుభ్రం చేయాలి. పంటకోత అనంతరం లేటరల్ పైపులను భద్రపర్చాలి.

భవనాలు శిథిలం.. సేవలకు కష్టం

ఇదీ బల్దియా, దవాఖానా భవనాల పరిస్థితి

న్యూస్‌టుడే, బోధన్ పురపాలిక

ప్రజలకు నిత్యం సేవలందించే బోధన్ ప్రభుత్వ జిల్లా దవాఖానా, బల్దియా కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించారు. ప్రస్తుతం వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారుతుండటంతో పాటు పెచ్చులు ఊడిపడుతుండటంతో అధికారులు, సిబ్బంది, వైద్యులు, రోగులు, కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే ఈ భవనాల్లో విధులు నిర్వర్తించడం, సేవలు అందించడం కష్టంగా మారుతోంది.

సరైన రక్షణ కరవు..

గత మూడేళ్లుగా వర్షం పడిన ప్రతిసారి బోధన్ బల్దియా కార్యాలయంలో పైకప్పు నుంచి నీరు కారుతోంది. ప్రధాన ద్వారం నుంచి పలు విభాగాల వరకు వర్షపు నీరు చేరుతోంది. నీటిని పట్టేందుకు ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. కంప్యూటర్లు, దస్త్రాలు తడవకుండా ప్లాస్టిక్ కవర్లు, ఫ్లెక్సీలతో కప్పి ఉంచుతున్నారు. దీంతో విలువైన సామగ్రి, దస్త్రాలకు సరైన రక్షణ లేకుండా పోతోంది. వర్షాకాలంలో అధికారులు, సిబ్బందితో పాటు వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

బోధన్ ప్రభుత్వ జిల్లా దవాఖానా పైఅంతస్తులో శిథిలావస్థకు చేరిన వార్డును మూసివేశారిలా..

ఇన్‌పేషెంట్ వార్డు మూసివేత..

బోధన్ ప్రభుత్వ జిల్లా దవాఖానకు సుమారు నిత్యం సుమారు 400 మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. 50 మందికి పైగా రోగులు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుంటారు. దవాఖానా పైఅంతస్తులోని ఇన్‌పేషెంట్ వార్డు గది పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో రెండేళ్ల కిందట దానిని మూసివేశారు. ఇతర వార్డులు సైతం వర్షాలకు ఉరుస్తున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గదుల్లోనే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. కాలానుగుణ వ్యాధుల కారణంగా రోగుల సంఖ్య పెరగడంతో సరిపడా గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అధికారులు ఏమన్నారంటే..

ఈ విషయమై జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా.శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ.. దవాఖానా మరమ్మతులకు రూ.66లక్షలతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరైతే మరమ్మతులు చేపట్టే అవకాశం ఉందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మాట్లాడుతూ.. బోధన్ బల్దియా నూతన కార్యాలయ నిర్మాణానికి రూ.5 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపామని పేర్కొన్నారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు.

వర్షాల వేళ పొలాల్లో యాజమాన్య పద్ధతులు

న్యూస్‌టుడే, రుద్రూర్

వర్షాలు కురిసిన సమయంలో పంటలకు ఎలాంటి రసాయనాలను పిచికారీ చేయొద్దని, ఎరువులు వేయొద్దని **రుద్రూర్ కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త ఇందూధర్‌రెడ్డి** సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత భూమిలో తేమ ఉన్నప్పుడు పంటలకు ఎరువులు వేయాలి. ఆరుతడి పంటల్లో కాల్వలు తీయడం ద్వారా నీరు నిల్వ లేకుండా చూడొచ్చు. మురుగు నీటిని ఎప్పటికప్పుడు పొలం నుంచి తీసేయాలి. వర్షాలతో కలుపు మొక్కలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. కాబట్టి గొర్రుతో అంతర కృషి తప్పనిసరిగా చేయాలి. పత్తి, సోయాచిక్కుడు పంటల్లో రసం పీల్చే పురుగులు వర్షాల ఉద్ధృతికి 90% వరకు తగ్గిపోయే ఆస్కారం ఉంటుంది. ఈ సమయంలో ఎలాంటి రసాయనాలను పిచికారీ చేయొద్దు. వర్షాల సమయంలో పొలంలో ప్రవహించే నీటిని కుంటల్లోకి మళ్లించి నిల్వ చేసుకోవడంతో బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆ నీటిని వినియోగించుకునే వీలుంటుంది. ఇంకుడు గుంతలతోనూ భూగర్భ జలాలను వృద్ధి చేయొచ్చు. ఈ నేపథ్యంలో రైతులు తమ పొలాల్లో ఇంకుడు గుంతలు, నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి.

రైతేరాజు

సోయాబీన్‌లో సస్యరక్షణ చర్యలు

న్యూస్‌టుడే, వర్ని : ఆలస్యంగా విత్తిన సోయాబీన్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ.. అవసరమైన సమయంలో సిఫార్సు చేసిన మందులను వినియోగిస్తే పంటను చీడపీడలు, తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చని **రుద్రూర్ చెరకు, వరి ప్రాంతీయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త రాకేష్** సూచించారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే పెట్టుబడి తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు కలుపు, చీడపీడల నివారణ గురించి వివరించారు.

● **కలుపు నివారణ :** విత్తిన మొదటి 45 రోజులు కలుపు నివారణకు కీలకం. ఈ సమయంలో నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు ఎకరానికి ఇమాజిథాఫిర్ 10శాతం ఈ.సి 300 మి.లీలు లేదా ఇమాజిథాఫిర్ + ఇమాజమాక్స్ 40గ్రా, ప్రొపాక్విజాఫాప్ + ఇమాజిథాఫిర్ 800 మి.లీ కలిపి కలుపు మందులను పిచికారీ చేయాలి. 40 రోజుల తర్వాత కలుపు మందుల వినియోగం ఆశించిన ఫలితం ఇవ్వదు. ఆలస్యంగా విత్తిన పంటలో 30-35 రోజుల సమయంలో 25-30 కిలోల యూరియాను పైపాటుగా వేసి మట్టితో కప్పాలి. బెట్ట పరిస్థితుల్లో సున్నిత, పుష్పించే దశలో 12-15 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి.

● **చీడపీడలు :** ఆలస్యంగా విత్తిన పంటలో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. తెల్లదోమ పర్యవేక్షణ, నియంత్రణకు ఎకరానికి పది పసుపురంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలి. అవసరమైనప్పుడు ఎసిటామిప్రిడ్ 20శాతం ఎస్.పి. లేదా డయాపెంద్యూరాన్ 50శాతం డబ్ల్యూపీ సూచించిన మోతాదులో చల్లాలి. బెట్ట పరిస్థితుల్లో సింథటిక్ పెరిత్రాయిడ్ మందులను ఉపయోగించొద్దు. పూతదశ నుంచి ఆంత్రాక్నోస్, ఆకుమచ్చ, కాయకుళ్లు, బొగ్గుతెగులు, రైజోక్టోనియా వేరుకుళ్లు వంటివి ఆశించే అవకాశం ఉంది. వీటిని ప్రారంభదశలోనే గుర్తించి టెబుకొనజోల్ లేదా మాంకోజెట్+కార్బండజిమ్ వంటివి సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయాలి.

పత్తిలో ఇలా..

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి : వర్షాల కారణంగా పత్తిని తెగుళ్లు, చీడపీడలు ఆశించే అవకాశం ఉందని, రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎల్లారెడ్డి ఏడీఏ సుధామాధురి తెలిపారు. ప్రధానంగా ఆకులు ఎర్రబడటం, పెరుగుదల లేకపోవడం, రసంపీల్చే పురుగులతో పాటు వివిధ తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోషకాలు అందించడానికి పైపాటుగా 19.19.19 లేదా పొటాషియం నైట్రేట్ 13-0-45 లేదా 10గ్రా యూరియాను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. భూమి ద్వారా పోషకాలు ఇస్తూ ఉండాలి. పైపాటుగా 20రోజులకు ఒకసారి దాదాపు 80 రోజుల వరకు ఎకరానికి 25కిలోల యూరియా, 10కిలోల పొటాష్ కలిపి మొక్కకు దగ్గరగా పడేలాగా వేయాలి. అధిక వర్షాలతో మొక్కలు వాడిపోవడం గమనిస్తే లీటరు నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా లేదా కార్బండిజమ్ 1గ్రా కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పేనుబంక, పచ్చదోమ వంటి రసం పీల్చే పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో లేదా ఫ్లోనికామిడ్, నీరు 1:20 నిష్పత్తిలో 30, 45, 60 రోజుల్లో అందించాలి. దీంతో రసం పీల్చే పురుగులను సమర్థంగా అరికట్టవచ్చు. తామర పురుగుల నివారణకు లీటరు నీటికి 2మి.లీ పిప్రోనిల్ లేదా 0.2గ్రా థయోమిథాక్సామ్ లేదా 0.3గ్రా ఫ్లోనికామిడ్‌ను పిచికారీ చేయాలి.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, వేదికపై డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, రూరల్-అర్బన్ సర్ పరిశీలకుడు రాఘవరెడ్డి

‘ప్రతి ఓటు కాపాడే బాధ్యత నాయకులదే’

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: సర్ నోటీసులు వచ్చిన ప్రతి వ్యక్తి ఓటును కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని, బూత్‌స్థాయి ఏజెంట్లు ఆ దిశగా పనిచేయాలని ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి పేర్కొన్నారు. డిచ్‌పల్లిలో సోమవారం సర్ నియోజకవర్గ సదస్సుకు డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, రూరల్-అర్బన్ పరిశీలకుడు రాఘవరెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. చిన్నచిన్న కారణాలతో వేలాది ఓటర్లకు నోటీసులు జారీ అయినట్లు తెలిపారు. ప్రతి నోటీసుకు సరైన ఆధారాలతో సమాధానం ఇవ్వాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. 1000 రోజుల ప్రజాపాలనలో పేదల అభ్యున్నతికి సర్కారు కృషి చేసిందన్నారు. పరిశీలకుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ.. సర్వేపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, గంగాధర్, శ్రీనివాస్, అంబర్‌సింగ్, సాయారెడ్డి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాప్‌లు తొలగించాలని ధర్నా

ఇందల్‌వాయి : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఎరువుల యాప్‌లతో కర్షకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని తక్షణమే తొలగించి పాత విధానంలోనే ఎరువులు పంపిణీ చేయాలని అన్నదాతలు ధర్నా చేశారు. ఇందల్‌వాయి సొసైటీలో సోమవారం 900 బస్తాల యూరియా కేవలం అప్‌లోడ్ చేసిన రెండు నిమిషాల వ్యవధిలోనే అయిపోయాయని, ఇలాగైతే రైతులు సాగు వదులుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు అత్యవసరమైన సమయంలో యూరియా దొరకడం లేదని పేర్కొన్నారు. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని వాపోయారు. ప్రభుత్వం స్పందించి యాప్‌లో పంపిణీ తొలగించాలన్నారు.

సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

2024 బీఈడీ ఫలితాలు విడుదల

తెలంగాణ విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: తెలంగాణ విశ్వవిద్యాలయం 2024 బ్యాచ్ బీఈడీ కోర్సు ఫలితాలను రిజిస్ట్రార్ యాదగిరి, సీఈవో సంపత్‌కుమార్, అదనపు కంట్రోలర్ శాంత సోమవారం విడుదల చేశారు. 1354 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 1288 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు. 95.12 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

నిలకడగా నీటిమట్టం

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి కేవలం 2315 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. నీటిమట్టం గత కొన్ని రోజులుగా నిలకడగా ఉంటోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా సోమవారం సాయంత్రం వరకు జలాశయంలో 1079.90 అడుగుల వరకు నీటిమట్టం ఉంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సోమవారం ఉదయం ఆరు గంటల వరకు ఎగువ నుంచి 35.478 టీఎంసీల నీరు చేరింది. కాకతీయ కాల్వ ద్వారా 250, మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల జరుగుతోంది. 482 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో తగ్గుతోంది.

ఎస్సారెస్పీలో నిల్వ ఉన్న నీరు

నిర్ణయం తీసుకోలేదు..

ఈ ఏడాది వానాకాలం పంటలకు నీటి విడుదలపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. నీటిని విడుదల చేయాలంటే ప్రాజెక్టులో కనీసం 55 టీఎంసీలు ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 44.713 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భారీ వర్షాలు కురిస్తేనే వరద పెరిగే అవకాశం ఉంటుంది. కానీ ఎల్‌నినో ప్రభావంతో వరణుడు కరుణించడం లేదు. ప్రాజెక్టు ద్వారా నీటిని ఎప్పుడు విడుదల చేస్తారా అని ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు.

పుర కమిషనర్ పర్వతాలుకు వినతిపత్రం ఇస్తున్న భాజపా కౌన్సిలర్లు

‘తీర్మానాలు రద్దు చేయాలని డిమాండ్’

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఆగస్టు 29న జరిగిన పురపాలక పాలకవర్గ సమావేశంలో అత్యవసరంగా కొన్ని అంశాలు చేర్చి ఆమోదించిన తీర్మానాలను రద్దు చేయాలని భాజపా కౌన్సిలర్లు కమిషనర్ పర్వతాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్ మాట్లాడారు. సభ జరిగే కంటే ముందు ప్రత్యేకంగా అంశాలను అజెండాలో చేర్చి ఆమోదించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో అధికారులు తగిన న్యాయం చేయాలన్నారు.

బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపాలస్వామి

సిద్దిపేట అర్బన్ : తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపాలస్వామి ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర మహాసభలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమ, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్, పద్మ, మోహన్, పుష్ప, చౌదరి, కార్యదర్శులుగా శోభ, సత్యం, రాజు, సులోచన, రాష్ట్ర కమిటీ సభ్యులుగా అంజయ్య, భాస్కర్, శ్యామల, లావణ్య, లహరి, గణేశ్ ఎన్నికయ్యారు.

రైల్వే డబ్లింగ్ పనులపై సమీక్ష

నిజామాబాద్ కలెక్టరేట్ : ముద్కేడ్ - మేడ్చల్ రైల్వే డబ్లింగ్ పనులకు సంబంధించిన భూసేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని ఇన్‌ఛార్జి కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని వివరించారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

వీసీలో పాల్గొన్న ఇన్‌ఛార్జి కలెక్టర్ భవేశ్‌మిశ్రా, అధికారులు

ఆటో, బైక్ - ఢీ.. ఇద్దరి పరిస్థితి విషమం

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: మండలంలోని బంజారా తండా వద్ద జాతీయ రహదారిపై ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లింగంపేట్ మండలం ఎక్కపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు ఆటోలో బంజారా తండా వద్ద ఉన్న బంధువుల ఇంటికి వస్తున్నారు. రాజంపేట్ మండలం గుడితండాకు చెందిన చోక్లా తన బైక్‌పై ఎల్లారెడ్డి నుంచి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో బంజారా తండా వద్ద ఆటో-బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సక్రాంతో పాటు, ఆటోలో ప్రయాణిస్తున్న అఖిల్, కమ్లి, శాంతి, లక్ష్మీలు గాయపడగా.. రవీందర్, నాన్వీష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఆసుపత్రికి తరలించారు. మరికొందరు మండల కేంద్రంలో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

రూ.10 నోటు ఇచ్చి.. రూ.20వేల అపహరణ

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా పోచమ్మరాల్ తండాకు చెందిన **మూడ్ కేస్లీ** తన భర్త దస్రియ్యతో కలిసి సోమవారం గోపాల్‌పేట్ వచ్చింది. స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లే సమయంలో స్కూటర్‌పై వచ్చిన వ్యక్తులు దంపతులను కలిశారు. రూ.పది నోటు ఇచ్చి దాన్ని నలిపి వాసన చూడమని చెప్పారు. దంపతులు అలా చేయగానే వారు మత్తులోకి జారుకున్నారు. వెంటనే ఆ వ్యక్తులు కేస్లీ వద్ద ఉన్న రూ.20వేల నగదు, 12 తులాల వెండి గొలుసును అపహరించి వాహనంపై వెళ్లిపోయారు. కొంతసేపటికి తేరుకున్న దంపతులు స్థానికుల సాయంతో పోలీసులను ఆశ్రయించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవీపేట, న్యూస్‌టుడే : వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు నవీపేట ఎస్సై శ్రీకాంత్, పౌరసరఫరాలశాఖ ఉప తహసీల్దారు పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన అర్బాద్ అనే వ్యక్తి ఆర్మూర్ నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు వ్యాన్‌లో 127.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా.. ఫకీరాబాద్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. డీటీ పవన్‌కుమార్ ఫిర్యాదు ఇచ్చిన మేరకు వాహన యజమానితో పాటు డ్రైవర్ అర్బాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అదనపు కలెక్టర్ విక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నేత్ర పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరంలో 175 మందికి కంటి పరీక్షలు చేసి 113 మందికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట్, నేత్ర వైద్యులు రవీందర్, శ్రీహరి కిషన్, వైద్యులు మారుతిబాబు, సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీనియర్ సివిల్ జడ్జిలు

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సీనియర్ సివిల్ జడ్జి పదోన్నతి పొందిన ముగ్గురు న్యాయమూర్తులు నూతన స్థానాల్లో సోమవారం బాధ్యతలు చేపట్టారు. వీరిలో నిజామాబాద్ సీనియర్ సివిల్‌జడ్జి అజయ్ ఉల్లమ్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి చైతన్య, న్యాయసేవా సంస్థ కార్యదర్శి ముద్దసాని నీలిమ ఉన్నారు. వీరు ఆర్మూర్ సీనియర్ సివిల్‌జడ్జి శ్రీదేవి నుంచి బాధ్యతలను స్వీకరించారు.

ఘనంగా తీజ్-గౌరీ మాత వేడుకలు

గాంధారి, న్యూస్‌టుడే : గాంధారి మండలంలోని చద్మల్, నేరల్, గుర్జాల్, కాయితి తండాల్లో లాభానా సమాజ్ ఆధ్వర్యంలో తీజ్-గౌరీ మాత వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. బంకమట్టి, కర్రలతో ప్రత్యేకంగా తీజ్ దేవతా విగ్రహాలను తయారు చేశారు. పెళ్లికాని యువతులు ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి ‘స్వాలీ-లాప్సీ (పోలేలు సీరా) నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. పురుషులు వలయాకారంలో తీజ్ మాత విగ్రహాల చుట్టూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు పండాలని తీజ్-గౌరీ మాతను కొలుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తండా పెద్దలు తాన్‌సింగ్, గంగాధర్, అమర్‌సింగ్, జగదీష్, బంతిలాల్, గంగాధర్, గణేష్, చందా నాయక్, భజన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: సారంగాపూర్‌కు చెందిన చాంద్కే మాధవ్ మృతికి కారకులైన బింగెవార్ రాజమణి, ఆమె కుమారుడు రాజు, తమ్ముడు మాధవ్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి హరీష సోమవారం తీర్పుచెప్పారు. మహారాష్ట్రకు చెందిన హమాలీ మాధవ్ తల్లి తారాబాయితో కలిసి సారంగాపూర్‌లో ఉంటున్నారు. అదే గ్రామానికి చెందిన రాజమణితో మాట్లాడొద్దని తల్లికి సూచించాడు. అది తెలిసిన రాజమణి 2022, ఏప్రిల్ 26వ తేదీన హోటల్‌లో టిఫిన్ చేస్తున్న చాంద్కే మాధవ్‌పై కుమారుడు రాజు, తమ్ముడు మాధవ్‌తో కలిసి దాడిచేసింది. స్పృహ కోల్పోయిన బాధితుడిని తల్లి వచ్చి పరిశీలించగా అప్పటికే అతడు చనిపోయాడు. ఆమె ఫిర్యాదుతో నిజామాబాద్ ఆరో ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి వారికి జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. పోలీసుల తరఫున కేసును అదనపు కోర్టు పీపీ నర్సింహారెడ్డి వాదించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

మా యొక్క రిజిష్టర్ చిట్‌ఫండ్స్ ప్రై.లి. వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి ఫైనాన్షియర్స్/ పెట్టుబడి దారులు (ఫుల్ సెక్యూరిటీ) కావలెను. M/s యోజన రూరల్ చిట్‌ఫండ్ ప్రై.లి. 4-542-543, 544 శ్రీ రాజరాజేశ్వరి నగర్, కొండాపూర్, శేర్‌లింగంపల్లి, Hyd- 500084. 96036 74849. ఏజెంట్స్ కావలెను.

COMPUTER EDUCATION

Satyam Computers Super Bumper Free Offers (1+1/1+2/1+3) Computer Courses Free Offers) PGDCA, Data Entry, Tally, Python, HTML, Jawa, Hardware, DTP. Last Date:2/9/2026, Contact: Satyam Computers, NZB. Cell: 8688815224.

To Book Your Classified Advertisements Please Call: 8008709960 ★ GST వర్తించును.

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

CHANGE OF NAME

I, Chekula Maladry (Old name) R/o.5-8-567/1, Ashok Nagar Colony, Kamareddy Town & Dist. TG, Holder of Passport S9681656 have changed my name as Chikula Malyadri (New name) S/o. Chekula Mala kondal.

JOBS

లక్ష్మీ TVS వినాయక్‌నగర్, NZB షోరూంలో సేల్స్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), సర్వీస్ మేనేజర్స్, సర్వీస్ అడ్వైజర్స్, అకౌంటెంట్స్, టెలికాలర్స్ (F), కంప్యూటర్ ఆపరేటర్, మెకానిక్స్ ,వాషింగ్‌బాయ్స్ కావలెను. సాలరీ+ఇన్సెంటివ్స్. 9704204164

శ్రీరామ్ అకాడమీకి ఇంటి వద్ద నుండి ప్రాజెక్టు వర్క్ చేయుటకు ఫోన్ ఉన్న వారు కావలెను. అ:10th, జీ:20k, శిక్షణ రుసుము కలదు. Cell: 8886160671.

Raghava Asset Finance లో బోధన్, నిజామాబాద్, బాన్సువాడ, గాంధారి, కామారెడ్డి ఏరియాలో Business Executive కావలెను. Phone No.: 7337558715, 9100902175.

MARKETING/ SALES

AUM-369 డైమండ్ జ్యూవెల్లరీ నిజామాబాద్‌లో (గంగాస్థాన్ & కుమార్‌గల్లీ) మరియు ఆర్మూర్, కామారెడ్డి స్టోర్‌లలో మేనేజర్, సేల్స్‌గర్ల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను. జ్యూవెల్లరీలో అనుభవంగల వారికి ప్రాధాన్యత. 8143403764.

విజయ్ ఇండస్ట్రీ శ్రీరక్షా హోమ్ సేఫ్ లాకర్స్ పెర్కిట్ మండలం ఆర్మూర్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారు Male మరియు Female కావలెను. సాలరీ+ఇన్సెంటివ్ ఇవ్వబడును. Conact: మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ ఇండస్ట్రీ, గట్ల ప్రవీణ్. 9848584077.

FACULTY/ TEACHERS

WANTED
Wanted Lecturers for Intermediate Courses in English, Chemistry, Physics, Botany & Zoology to teach in English Medium to Women's College, Kanteshwar, Nizamabad preferably Female Candidate with aggregate marks of 55% in Post Graduation. Submit resumes with Qualification certificates from 02.09.2026 to 05.09.2026.
✆: 9959908980, 7780342171

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

విగ్రహ నమూనా ప్రతుల ఆవిష్కరణ

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: పోచమ్మగల్లీలో రవితేజ యూత్ సొసైటీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో నెలకొల్పనున్న 54 అడుగుల మట్టి వినాయక విగ్రహ నమూనా ప్రతులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు.

గుంతలు పూడ్చాలని వినతి

బోధన్ పురపాలిక : ఆటోనగర్ కాలనీవాసులు సోమవారం బల్దియా కమిషనర్ జాదవ్ కృష్ణను కలిశారు. ఈ మేరకు వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని కాలనీలోని రోడ్లపై పడ్డ గుంతలను మొరంతో పూడ్చాలని వినతిపత్రం అందజేశారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

ఎడపల్లి : టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎమ్మెస్సీఫారంలో ఎడపల్లి పీహెచ్‌సీ, నవీపేట క్షయ విభాగం ఆధ్వర్యంలో సోమవారం క్షయ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. 92 మందికి ఛాతీ ఎక్స్‌రే తీశారు. 79 మంది నుంచి కఫం నమూనాలు సేకరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వినీత్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

నిజామాబాద్ 94408 85670
బోధన్ 94949 61502
మోపాల్ 94921 61451
నిజామాబాద్ గ్రామీణం 97007 47516

సమస్య: బోధన్ హౌసింగ్‌బోర్డు కాలనీలో మురుగు కాల్వలను సకాలంలో శుభ్రం చేయడం లేదు. మురుగు నిలిచి దుర్వాసన వస్తుంది. **- కాలనీవాసులు**

పరిష్కారం : ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' బల్దియా పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి గణేశ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన కార్మికులతో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, బోధన్ పురపాలిక

సమస్య: ఇందల్‌వాయి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నిర్మించిన అండర్‌పాస్ వంతెనలో పగుళ్ల వద్ద నీరు కారుతోంది. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి. **- సదానంద్, మాజీ సర్పంచి, ఇందల్‌వాయి**

సమాధానం: వానాకాలం ప్రారంభంలోనే వంతెనలపై ఉన్న అన్ని మురుగు గొట్టాలు శుభ్రం చేసి నీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నాం. దీంతో సమస్య రాదు.
- వీరబాబు, టోల్‌ప్లాజా నిర్వహణ మేనేజర్, ఇందల్‌వాయి

– న్యూస్‌టుడే, ఇందల్‌వాయి

సమస్య: వినాయక్‌నగర్ పాత హౌసింగ్ బోర్డుకాలనీలోని అనుసంధాన రోడ్లు గుంతలమయం అయ్యాయి.
- వెంకటేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపించి గుంతలను పూడ్చివేయిస్తాం.
- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

– న్యూస్‌టుడే, సుభాష్‌నగర్

సమస్య: గూపన్‌పల్లి వీరభద్రనగర్ కాలనీలో డ్రైనేజీలు నిర్మించలేదు. ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి దుర్వాసన వస్తోంది. **- వేణుగోపాల్, స్థానికుడు**

పరిష్కారం: కచ్చా డ్రైనేజీలు తీసి సమస్య పరిష్కరిస్తాం. **- షాదుల్లా, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

– న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

కేంద్ర కారాగారంలో భద్రత పటిష్ఠం : సీపీ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర కారాగారంలో భద్రత ఏర్పాట్లను పటిష్ఠం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని సీపీ సాయిచైతన్య ఆదేశించారు. జైలును సోమవారం ఆయన పరిశీలించారు. భద్రత, బందోబస్తు, సిబ్బంది విధుల కేటాయింపును చూసిన అనంతరం అధికారులతో మాట్లాడారు. ప్రహరీ వద్ద భద్రతాపరమైన లోపాలు లేకుండా చూడాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో, డీ-అడిక్షన్ కేంద్రంలో ఖైదీలకు అందుతున్న చికిత్సల గురించి తెలుసుకుని పలు సూచనలు చేశారు. సీపీ వెంట జైలు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, జైలర్లు తిరుమలరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ జైలర్ మన్మథరావు, రిజర్వ్ సీఐ ధరణికుమార్, మెడికల్ అధికారి సాగ్రమాట్, ఆరో ఠాణా ఎస్‌హెచ్‌వో సందీప్ పాల్గొన్నారు.

కారాగారాన్ని పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య, పక్కన సూపరింటెండెంట్ అశోక్

ఒత్తిడి తట్టుకుని వృత్తికి న్యాయం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పని ఒత్తిడిని తట్టుకుని వృత్తికి న్యాయం చేయడం అభినందనీయమని సీపీ సాయిచైతన్య అన్నారు. పదవీ విరమణ పొందిన ఏఎస్సై కె.గంగాధర్‌గౌడ్, ఆర్ఎస్సై అమీరుద్దీన్, కానిస్టేబుల్ అశోక్‌కు నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏసీపీ శ్రీరాములు, సూపరింటెండెంట్లు జగతి, వనమాల, సీఐలు శ్రీధర్‌రెడ్డి, ధరణికుమార్, శేఖర్‌బాబు, సతీష్ పాల్గొన్నారు.

పోర్టల్‌లో కనిపించని శాఖలు

న్యూస్‌టుడే, కోటగిరి

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, చిన్నపాటి సమస్యలను సైతం అధికారులకు విన్నవించేందుకు సర్కారు.. మండలాల్లో 'ప్రజావాణి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆగస్టు 17వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజావాణి పోర్టల్‌కు అనుసంధానం చేశారు. ప్రతీ సోమవారం మండల స్థాయిలో కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. 'ప్రజావాణి'కి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీని అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమీక్ష నిర్వహించింది. ప్రజలు సమర్పిస్తున్న అర్జీల్లో పోలీస్, ఎక్సైజ్, తాగునీటి సరఫరా, అగ్నిమాపకశాఖలకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది. రెండు వారాలుగా నిర్వహించిన ప్రజావాణికి పోలీస్, ఎక్సైజ్‌శాఖల అధికారులు రాలేదని, ఆ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇదిలా ఉండగా.. ప్రజావాణి పోర్టల్‌లోని ఫిర్యాదుల కేటగిరిలో ఈ రెండు శాఖలు కనిపించకపోవడం గమనార్హం.

11 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతి

నిజామాబాద్ నేరవిభాగం : నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 11 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సై పదోన్నతి లభించింది. వారిని సీపీ తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. పదోన్నతులు పొందినవారిలో వివిధ ఠాణాలకు చెందిన గంగాధర్‌రావు, రాజేశ్వర్, మోహన్, జగదీశ్వర్, చిన్నసాయిలు, రాజశేఖర్, జి.రాజేందర్, పి.సుదర్శన్, డేనియల్ భాస్కర్, కె.సుంకన్న, మల్లేశం ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షురాలిగా సుజాత (బాకర్‌ఫారం), కార్యదర్శిగా భాగ్యశ్రీ (ఎత్తొండ), కోశాధికారిగా గంగాలత (ఎత్తొండ)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు, సర్పంచి మధు, ఏపీఎం భాస్కర్ పాల్గొన్నారు.

రుద్రూర్ : రుద్రూర్ సమీకృత మండల కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం బస్వంత్‌రావు ఆధ్వర్యంలో మండల సమాఖ్య మహాజన సభ నిర్వహించారు. గత ఏడాది కాలంలో జరిపిన లావాదేవీల నివేదిక చదివి వినిపించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా రాధ, కార్యదర్శిగా గంగామణి, కోశాధికారిగా తబస్సుంబేగం ఎన్నికయ్యారు.

సంకష్ట హర చతుర్థి పూజలు

నిజామాబాద్ సాంస్కృతికం : సంకష్టహర చతుర్థి సందర్భంగా నగరంలోని గణనాథుని ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, గరిక పూజలు నిర్వహించారు. సార్వజనిక్ గణేశ్‌మండలి, గాయత్రినగర్ సిద్ధివినాయక మందిరం, శుభంకరోతి కల్యాణ గణపతి, లక్ష్మీగణపతి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

శుభం కరోతి కల్యాణ గణపతి ఆలయంలో..

జీవనభృతి రూ.4 వేలు అందించాలి

ధర్పల్లి : రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు అందిస్తున్న జీవనభృతిని రూ.4 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ధర్పల్లిలో సీఐటీయూ నాయకులు సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొత్తవారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని కోరారు. నాయకులు రమేష్, గంగామోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణలను అడ్డుకోండి'

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఇందల్‌వాయి మండలం గన్నారం రెవెన్యూ పరిధి అసైన్డ్ భూమిలోని చెట్లను కొందరు యథేచ్ఛగా నరికి ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు సోమవారం ఆరోపించారు. మండల, జిల్లా అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, రెవెన్యూ భూమికి హద్దులు గుర్తించి కాపాడాలని కోరారు.

ఎన్‌హెచ్‌ఎం కార్యక్రమాలపై సమీక్ష

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలను మరింత విస్తృతం చేయాలని ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి సూచించారు. జిల్లా కేంద్రంలోని వైద్యశాఖ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య పథకం కార్యక్రమాలపై ప్రోగ్రాంల అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో ఆరోగ్యంపై అవగాహన కలిగించాలని ట్రైనీ కలెక్టర్ సూచించారు. జీవనశైలి వ్యాధులు, క్షయ నివారణతో పాటు ఎన్‌హెచ్‌ఎం కార్యక్రమాలపై అన్ని శాఖల సమన్వయంతో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీటీసీవో నాగేశ్వరి, డీఐవో అశోక్, ఏవో సుమంత్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ సురేష్

పదవీ విరమణ సన్మానం

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: టీఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ గైని గంగారాంను ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి హుస్సేని సన్మానించారు. గంగారాం పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నగరంలోని శ్రీరామగార్డెన్‌లో సోమవారం జరిగింది. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్‌కుమార్, కార్యదర్శి నేతికుంట శేఖర్ పాల్గొన్నారు.

గంగారాంను సన్మానిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

రహదారి ధ్వంసం.. ప్రయాణం భారం

అంబం - ఎమ్మెస్సీఫారం రహదారి అధ్వానంగా మారింది. సుమారు 9 కి.మీ మేర రోడ్డు దెబ్బతినడంతో ప్రయాణ సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం మీదుగా రెంజల్, అంబేద్కర్‌నగర్, జైతాపూర్, బ్రాహ్మణపల్లి, ఏఆర్పీక్యాంపు, అంబం గ్రామాల ప్రజలు బోధన్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై ఉన్న చిన్న గుంతలు పెద్దవయ్యాయి. పలుచోట్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఎడపల్లి

మద్యం దుకాణాలను అరికట్టాలి

పోతంగల్, న్యూస్‌టుడే : గ్రామంలో ఉన్న అక్రమ మద్యం దుకాణాలను అరికట్టాలని మండలంలోని చేతన్‌నగర్ గ్రామస్థులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇష్టారీతిన మద్యం విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. మద్యం మత్తులో కుటుంబ కలహాలు, ఘర్షణలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి అక్రమ మద్యం విక్రయాలకు కళ్లెం వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గౌతమ్, గ్రామస్థులు చంద్రకాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: సుభాష్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. వైద్య చికిత్స సాయానికి అందించే నిధులను ప్రభుత్వం పెంచాలని ఎమ్మెల్యే అన్నారు. భాజపా నాయకులు మరం పవన్, రాజేందర్, మల్లేష్ యాదవ్, చిరంజీవి, కిషోర్, శంకర్, స్వామియాదవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

బోర్గాం(పి)(మోపాల్), నవీపేట, న్యూస్‌టుడే : బోర్గాం(పి) జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు శ్రీకాంత్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు. నాళేశ్వర్ పాఠశాల ఉపాధ్యాయుడు సంజీవ్‌రావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి జడ్పీ మాజీ ఛైర్మన్ విఠల్‌రావు హాజరై మాట్లాడారు. ఎంఈవో అశోక్, సర్పంచులు లావణ్య, కాంతారావు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌కు.. నవీపేట: రాంపూర్, ఎల్‌కేఫారం, ఫతేనగర్ గ్రామాల లైన్‌మెన్ లక్ష్మణ్‌ను ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ మేరకు రాంపూర్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచి కమలాకర్‌తో పాటు గ్రామస్థులు లక్ష్మణ్‌ను సన్మానించారు.

సాగు నీరు విడుదల చేయాలి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాలకల్ చెరువు అలీసాగర్ ఎత్తిపోతల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని ధర్మారం, మెంట్రాజ్‌పల్లి, బర్దీపూర్, తాడెం గ్రామాల రైతులు ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డిని కోరారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. వరి పొట్ట దశలో ఉన్నందున 15 రోజులకు ఒకసారి నీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్, జిల్లా అధికారులతో మాట్లాడి రైతులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసు, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: డిచ్‌పల్లి, మోపాల్ మండలం గొల్లపల్లి, అమ్రాబాద్ గ్రామాలకు చెందిన తేలు లోకేశ్, బానోత్ వర్షిత్‌లు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానాలో చికిత్స పొందుతున్నారు. వీరి శస్త్రచికిత్సల నిమిత్తం ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి రూ.11 లక్షల విలువ చేసే ఎల్‌వోసీ పత్రాలను సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: డిచ్‌పల్లిలో సోమవారం సర్‌పై నిర్వహించిన రూరల్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో రంజిత్‌నాయక్ తండా ఉపసర్పంచి సుదర్శన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కవితకు ఘనస్వాగతం

ఇందల్‌వాయి : తెలంగాణ రక్షణ సేన పార్టీ పెట్టి తొలిసారి జిల్లాకు వచ్చిన ఆ పార్టీ అధ్యక్షురాలు కవితకు ఇందల్‌వాయి మండలం దేవితండా, గన్నారం వద్ద తెలంగాణ జాగృతి, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆమె డా.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత పార్టీ జెండా ఎగురవేశారు. నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఆమెను సన్మానించారు. తర్వాత ర్యాలీగా నగరానికి వెళ్లారు.

గన్నారం వద్ద పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కవిత

సభకు తరలిన నాయకులు

ఎడపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత నిజామాబాద్ నగరంలో సోమవారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభకు ఎడపల్లి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాయకులు శేఖర్ రాజు, సత్యాగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజావాణిలో 159 ఫిర్యాదుల స్వీకరణ

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో 159 ఫిర్యాదులొచ్చాయి. అదనపు కలెక్టర్ భుజంగరావు, శిక్షణ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస్‌రావు, ఏసీపీ శ్రీశైలం అర్జీలు స్వీకరించారు.

☛ బీడీ కార్మికులకు చేయూత పెన్షన్ ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వి.ప్రభాకర్, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం డీఆర్‌డీవో సాయన్నకు వినతిపత్రం అందజేశారు.

☛ తమ గ్రామం సమీపంలో గోదావరి పుష్కర ఘాట్ నిర్మించాలని నవీపేట మండలం యంచ గ్రామస్థులు అధికారులను కోరారు.

నిజామాబాద్ నేరవిభాగం: నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 34 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించిన సీపీ సాయిచైతన్య ఠాణాల ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలిచ్చారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భుజంగరావు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

అర్జీల వెల్లువ

నవీపేట, ఎడపల్లి, కోటగిరి, పోతంగల్, రుద్రూర్, న్యూస్‌టుడే : జిల్లాలోని మండలాల్లో సోమవారం జరిగిన ప్రజావాణికి అర్జీలు వెల్లువెత్తాయి. నవీపేటలో 5, ఎడపల్లిలో 5, కోటగిరిలో 15, పోతంగల్‌లో 6, రుద్రూర్‌లో 2 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవోలు నాగనాథ్, శంకర్, విష్ణు, చందర్, బాలగంగాధర్ తెలిపారు. కోటగిరిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన 120 రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు

అక్రమంగా నిర్మాణం చేస్తున్నారని..

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : డిచ్‌పల్లి మండలం నడిపల్లి ఈదుల్ల చెరువుకు సమీపంలోని ప్రభుత్వ భూమిలో నడిపల్లి తండాకు చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఫామ్ హౌస్ నిర్మాణం చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని నడిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం డిచ్‌పల్లి మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వీడీసీ సభ్యులు అశోక్, పండరి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరావాలి

నిజామాబాద్ విద్యావిభాగం : నూతన పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దుకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు జిల్లా నుంచి 1500 మంది ఉపాధ్యాయులతో తరలివెళ్లనున్నట్లు ఆ సంఘం నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, కిషన్, అసోసియేట్ అధ్యక్షుడు అంకం నరేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు తరలిరావాలని కోరారు.

బస్సు సర్వీసులు పెంచాలని నిరసన

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : బోధన్ మండలం కల్దుర్కి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు సరిపడా లేకపోవడంతో కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు చెప్పారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో ఆర్టీసీ బస్సును నిలిపివేసి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అవసరానికి సరిపడా సర్వీసులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ విషయమై అధికారులు దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

మాస్టర్ ప్లాన్ లోపాలను సవరించండి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ నాయకులు జిల్లా కేంద్రంలోని ర.భ. శాఖ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌లో లోపాలున్నాయని, సవరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బోర్గాం(పి) (మోపాల్), న్యూస్‌టుడే: బోర్గాం(పి) జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సురేశ్ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక కావడంతో సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శంకర్ మాట్లాడుతూ.. దోమకొండలో నిర్వహించిన పోటీల్లో సురేశ్ రాణించి బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి ఎంపికైనట్లు తెలిపారు. మరో విద్యార్థి సోఫియాన్ కూడా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని రెండో ఠాణా పరిధిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దబజార్‌కు చెందిన అజయ్‌గౌడ్(25) కూలి పనులు చేసుకుని జీవించేవాడు. మద్యానికి బానిసైన అతడు సోమవారం పురుగుల మందు తాగి ఆర్యసమాజ్ వద్ద పడిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించగా అజయ్‌గౌడ్ అప్పటికే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బోధన్ గ్రామీణం: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు బోధన్ గ్రామీణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బోధన్ మండలం ఎరాజ్‌పల్లికి చెందిన నర్సయ్య (48) అనే వ్యక్తి కొంతకాలం నుంచి ఏ పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది వారం కిందట ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గుర్తించిన కుటుంబీకులు అపస్మారకస్థితిలో ఉన్న అతనిని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. నర్సయ్య భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వాహన దొంగ అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం: వాహన చోరీలకు పాల్పడిన వ్యక్తిని నగరంలోని రెండో ఠాణా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి వివరాల ప్రకారం.. నగరంలోని పెద్దబజార్‌లో చేపట్టిన తనిఖీల్లో నవీపేట్ ఫతేనగర్‌కు చెందిన అబ్దుల్ సల్మాన్‌ఖాన్(30)ను పట్టుకున్నారు. తాను నడిపే ద్విచక్రవాహనాన్ని బర్కత్‌పురాలో చోరీచేసినట్లు అంగీకరించాడు. నాలుగో ఠాణా పరిధిలో ఓ కారును మాయం చేసి ఐటీఐ కళాశాల వద్ద వదిలి వెళ్లినట్లు చెప్పాడు. రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్ : మంజీరా నది నుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా.. సోమవారం తెల్లవారుజామున మందర్న శివారులో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి ఘటనపై కేసు నమోదు చేసినట్లు బోధన్ గ్రామీణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఆరు టిప్పర్లు....

చందూర్: ఘన్‌పూర్ అటవీ ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న ఆరు టిప్పర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ సోమవారం తెలిపారు. టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏడు రోజుల జైలు శిక్ష

రెంజల్ (నవీపేట): మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు ఎస్సై గంగాధర్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 30న ఎస్సై సిబ్బందితో కలిసి రెంజల్ మండలం సాటాపూర్ కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఎడపల్లికి చెందిన షేక్ నయీం అనే యువకుడు మద్యం తాగి వాహనం నడుపుతుండగా.. పోలీసులు అతనిని పట్టుకున్నారు. నిందితుడిని బోధన్ కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి అతనికి ఏడు రోజుల పాటు జైలు శిక్ష విధించారని చెప్పారు. మరో కేసులో ముగ్గురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని వివరించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దినేష్ కులాచారి జన్మదిన వేడుకలు

ఇందల్‌వాయి, నిజామాబాద్ గ్రామీణం, సిరికొండ (ధర్పల్లి), డిచ్‌పల్లి, న్యూస్‌టుడే : భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి జన్మదిన వేడుకలను సోమవారం భాజపా నాయకులు ఇందల్‌వాయిలో నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాజన్న, ఇందల్‌వాయి ఉపసర్పంచి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మల్కాపూర్ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పార్టీ మండల నాయకులు నోట్ పుస్తకాలు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లారం సర్పంచి గోపి, అసెంబ్లీ కన్వీనర్ పద్మారావు, నాయకులు రవి, రాజు తదితరులు పాల్గొన్నారు. సిరికొండలో భాజపా మండల కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయకులు సంజీవ్‌రెడ్డి, బాబురావు, రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, లింబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. డిచ్‌పల్లిలోని మానవతాసదన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సతీష్‌రెడ్డి, గంగారెడ్డి, విష్ణు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్ తండాలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తూ..

వర్సిటీ భూములు కాపాడాలని వినతి

తెలంగాణ విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వ్యవసాయ కళాశాలకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని సోమవారం రిజిస్ట్రార్ యాదగిరికి పీడీఎస్‌యూ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. కాలేజీ కోసం వర్సిటీ భూములను కేటాయించడం సరికాదని పేర్కొన్నారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, నాయకులు నితిన్, సంజయ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

నవీపేట, న్యూస్‌టుడే : నవీపేట పంచాయతీ కార్యదర్శిపై మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదు చేసినట్లు ఐదో వార్డు సభ్యుడు రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1న నిర్వహించనున్న పాలకవర్గం సాధారణ సమావేశంపై కార్యదర్శి పంచాయతీరాజ్ చట్టం నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫకీరాబాద్‌లోని పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందించినట్లు పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు రేహాన్ తెలిపారు.

(c) eenadu

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ

సిద్ధేశ్వరుడికి అభిషేకాలు

పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఆర్మూర్, న్యూస్‌టుడే: సిద్దులగుట్టపై మూడో శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. శివాలయంలో స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సుమన్, గంగారెడ్డి, చరణ్, మురళి, మంజుల, రవి, శంకర్, మల్లయ్య, సతీష్, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదైన భూముల వివరాలు

ఈనాడు కథనానికి స్పందన

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో ఆర్మూర్ అర్బన్ పరిధిలోని భూముల వివరాలు నమోదు కాలేదు. దీంతో యాప్ ద్వారా రైతులు యూరియా, ఇతర ఎరువులు పొందలేకపోతున్నారు. ఈ విషయమై 'యాప్‌తో అన్నదాతలు పరేషాన్' అనే శీర్షికన 'ఈనాడు'లో ఆగస్టు 30న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. సోమవారం యాప్‌లో రైతులు యూరియా బుక్ చేసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో సోమవారం ఆర్మూర్ రైతువేదిక వద్ద ప్రత్యేకంగా సమావేశమై ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. రైతు ప్రతినిధి కలిగోట గంగాధర్, మగ్గిడి రాజేశ్వర్, బొల్లు పోతన్న, నారడీ మల్లయ్య, లింగం, భూపతిరెడ్డి, దోమకొండ రవీందర్, భాజన్న తదితరులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

99637 26255 (భీమ్‌గల్)
99668 83996 (ఆర్మూర్)

భీమ్‌గల్ న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక రోడ్డుపై చెత్తాచెదారం వేశారు. పందులు తిరుగుతున్నాయి. దుర్వాసన వస్తోంది. -స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి చెత్తను తొలగించేలా చూస్తాం. -సంతోష్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆర్మూర్, న్యూస్‌టుడే: మామిడిపల్లి పరిధిలో కెనాల్ పక్కన పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇబ్బందికరంగా ఉన్నాయి. వాటిని తొలగించండి. -సురేష్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి కార్మికులతో తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. -నరేందర్, శానిటరీ సూపర్‌వైజర్

పక్కాగా పంట లెక్కలు

డివిజన్ వ్యాప్తంగా 52 మందితో సర్వే

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కచ్చితమైన సాగు వివరాల నమోదు లక్ష్యంగా జియోఫెన్సింగ్, ఉపగ్రహ సాంకేతికతో ఆర్మూర్ డివిజన్‌లో పంటల సర్వే(డీసీఎస్)ను చేపట్టారు. వారం రోజులుగా సిబ్బంది సర్వే చేస్తున్నారు. రైతు ప్రయోజనాలతో పాటు కొనుగోళ్లు, పంటలకు నష్టం జరిగినప్పుడు పరిహారం చెల్లించేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

191 క్షేత్రాల్లో..

ఆర్మూర్ డివిజన్‌లో వ్యవసాయశాఖ 191 గ్రామాల్లో సర్వే చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యువతీయువకులను సర్వేయర్లుగా ఎంపిక చేశారు. 52 మంది పంటల సర్వేలో నిమగ్నమయ్యారు. ఒక్కొక్కరికి గరిష్ఠంగా 4500 సర్వే నంబర్లు కేటాయించారు. ఒక ఎంట్రీని ఒక సర్వే నంబరుగా పరిగణిస్తారు.

క్షేత్రాల వద్దే నమోదు

పంట పొలం వద్దకు వెళ్లగానే యాప్ తెరిచిన వెంటనే రైతు పేరు, సర్వే నంబరు వస్తుంది. ఏ పంట సాగు చేశారో రైతులు పక్కా నమోదు చేయించుకోవాలి. ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక వేళ సిగ్నల్ సమస్య ఎదురైతే సర్వేయర్ రైతు వేసిన పంటను ఫొటో తీసి తదుపరి యాప్‌లో నమోదు చేసే వెసులుబాటు ఉంది.

కమ్మర్‌పల్లిలో సర్వే చేస్తున్న అధికారి

నియోజకవర్గం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	సర్వేయర్ల సంఖ్య
ఆర్మూర్	91,564	21
బాల్కొండ	1,42,015	31

కొనుగోళ్ల సమయంలో..

రైతులు వివిధ రకాల పంటలను విక్రయించేటప్పుడు ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలను సరిచూసుకుని ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. సర్వేనంబర్ల బట్టి పంటల సాగు వివరాల ఆధారంగా గతేడాది నుంచి ధాన్యం, మక్కలు, సోయాబీన్ పంటలను కొనుగోలు చేస్తోంది. కొంత మంది పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో విక్రయించుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. కాబట్టి క్రాప్ బుకింగ్‌లో హెచ్చుతగ్గులకు అవకాశం లేకుండా చూసుకోవాలి.

వేగంగా సాగుతోంది

-లావణ్య, ఏడీఏ, భీమ్‌గల్

అక్టోబరు మొదటి వారంలోగా సర్వే పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. సర్వే వేగంగా సాగుతోంది. కచ్చితమైన వివరాలు సేకరిస్తున్నాం. రైతులు అందుబాటులో ఉండి సర్వేయర్లకు సహకరించాలి.

పేదలకే రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఆర్మూర్, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని అర్హులైన పేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎల్లయ్య మాట్లాడుతూ.. ఆర్మూర్ పట్టణంలో పేదలు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇంటి స్థలం కేటాయించి రూ. 10లక్షల రుణం మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు భూమన్న, రవి, నగేష్, సాయిలు, అమీర్‌ఖాన్, షాహిదాబేగం, కల్లుబాయి, విట్టల్, రాధ, లక్ష్మి, పద్మ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) ఈనాడు సినిమాలు

స్క్రీన్-01: **ఇరుముడి:** 11:30, 6:30, 9:30
స్క్రీన్-02: **టాక్సిక్:** 2:30
స్క్రీన్-03: **విశ్వనాథ్ అండ్ సన్స్:** 1:15
స్క్రీన్-04: **ఇరుముడి:** 10:30, 1:00, 4:00, 7:00, 10:00

న్యూస్‌టుడే, ఆర్మూర్

ఇంటింటికీ మొక్కల పంపిణీ

ఆర్మూర్: వనమహోత్సవంలో భాగంగా ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లహరి మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. మొక్కలు నాటాలని సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ మండల కేంద్రంలో పోలీసులు సోమవారం అలీమ్, ఇమ్రాన్ ఇళ్లపై దాడులు నిర్వహించారు. 10 క్వింటాళ్ల 60 కిలోల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

సమన్వయంతో పనిచేయాలి

సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

ఆర్మూర్, న్యూస్‌టుడే: సెప్టెంబరులో జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి సోమవారం ఆర్మూర్ కోర్టులో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సరళ రాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ పాల్గొన్నారు. పెండింగ్ కేసులను గుర్తించి, ఇరుపక్షాల సమ్మతితో కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ చందర్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి రాజేందర్, న్యాయవాదులు రమేష్, గణేష్, సుభాష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

ఆర్మూర్, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా మున్సిపల్ అధికారులు సోమవారం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. నాలుగు దుకాణాల్లో కవర్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు విధించారు. తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. తనిఖీల్లో శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది సంతోష్, రాము, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాలను ఛైర్‌పర్సన్ లహరి సోమవారం తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కవిత

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్ మండలం సీహెచ్ కొండూర్ గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామిని సోమవారం సాయంత్రం మాజీ ఎంపీ కవిత, అనిల్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నవీన్‌రెడ్డి, మనోజ్‌రావు, సంతోష్, దినేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వస్తున్న కవిత దంపతులు

నేడు పసుపు సాగుపై అవగాహన

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం ఆధ్వర్యంలో 'శాస్త్రీయ పద్ధతుల్లో పసుపు సాగు' అనే అంశంపై రైతులకు మంగళవారం ఏర్గట్లలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శాస్త్రవేత్త విద్య తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి రైతులు హాజరుకావాలని సూచించారు.

స్మార్ట్ రేషన్ కార్డులు అందజేత

మోర్తాడ్, న్యూస్‌టుడే: స్మార్ట్ డిజిటలైజేషన్ రేషన్ కార్డులను సోమవారం శెట్‌పల్లి గ్రామంలో సర్పంచి విజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఆయన మట్లాడుతూ స్మార్ట్ కార్డుల ద్వారా సులభంగా సరకులు పొందవచ్చన్నారు.

రోడ్లపై అడ్డగోలుగా నిర్మాణాలు

ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో కొన్ని నివాసాల ముందర షెడ్లు నిర్మించారు. జిరాయత్ నగర్‌లో రోడ్డుపై షెడ్లు నిర్మించుకున్నారు. కార్లు, ఇతర వాహనాలు నిలుపుతున్నారు. శ్రీరామకాలనీలో కూడా ఇదే మాదిరిగా నిర్మించడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది.

ఆర్మూర్, న్యూస్‌టుడే

ఆర్మూర్ పట్టణంలో ఇటీవల కాలంలో ఇళ్ల ఎదుట రోడ్లపై, డ్రైనేజీలపై అక్రమంగా షెడ్లు, వరండాలు, రేకుల నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ప్రధాన వీధులు, అంతర్గత రోడ్లపై పలువురు తమ ఇళ్ల ముందు భాగాన్ని దాటి రోడ్లపైకి షెడ్డులు వేయడంతో రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కారు షెడ్డులు నిర్మించడం రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా హౌసింగ్ బోర్డ్ కాలనీ, శ్రీరామ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, టీచర్స్ కాలనీ, రాంనగర్‌లలో కనిపిస్తున్నాయి. పాదచారులు నడకకు కేటాయించిన స్థలాల్లోనూ వెలుస్తున్నాయి.

మున్సిపల్ నిబంధనల ప్రకారం రహదారులపై లేదా పబ్లిక్ ప్రదేశాల్లో నిర్మాణాలు చేయడానికి ప్రత్యేక అనుమతులు అవసరం. చాలా మంది ఈ నియమాలను పట్టించుకోకుండా నిర్మిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. కొంత మంది తాత్కాలికంగా టిన్ షీట్లతో, మరికొందరు సిమెంట్‌తో షెడ్డులు ఏర్పాటు చేస్తున్నారు.

ఇబ్బందులు తప్పవు

అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు వంటి అత్యవసర వాహనాలకు కాలనీల్లో వెళ్లడానికి ఇబ్బందులు తప్పవని స్థానికులు చెబుతున్నారు. షెడ్డుల కారణంగా రోడ్డు పక్కన నడిచే స్థలం లేకపోవడంతో పాదచారులు రోడ్డు మధ్యలో నడవాల్సి వస్తోంది. చిన్న పిల్లలు, వృద్ధులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. డ్రైనేజీలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. చెత్త, వర్షపు నీరు సాఫీగా పారకుండా నిల్వ ఉంటుంది. దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజారోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మండలస్థాయిలో ప్రజావాణి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండలస్థాయి ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో శివాజీ అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

ముప్కాల్: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ముప్కాల్‌లో ఐదు, మెండోరాలో ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి.

భీమ్‌గల్: భీమ్‌గల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండలస్థాయి ప్రజావాణికి 7 ఫిర్యాదులు వచ్చాయని ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు.

బాల్కొండలో జరిగిన ప్రజావాణిలో అర్జీ స్వీకరిస్తున్న ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి

అర్జీలు పరిశీలించి పరిష్కరించండి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తొమ్మిది ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా దరఖాస్తులు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొటార్మూర్ సర్వే నంబరు 160లో గ్రామస్థులు భూములు కోల్పోయారు. దీంట్లో రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారు. భూములు కోల్పోయిన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని కొటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వినతిపత్రం అందించి కోరారు.

సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందిస్తున్న కొటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నందిపేట్, న్యూస్‌టుడే: ప్రజలు సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ వాసుదేవ్ అన్నారు. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో సోమవారం స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... గుర్తు తెలియని వారు ఫోన్ చేసినా, లింకులు పంపించినా స్పందించవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో జూదం ఆడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సర్పంచి రాజారెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు అధికం

బాల్కొండ, న్యూస్‌టుడే: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని ఉద్యాన శాఖ బాల్కొండ డివిజన్ అధికారి రుద్ర వినాయక్ అన్నారు. బాల్కొండలో గంగ నర్సయ్య వ్యవసాయ భూమిలో సోమవారం ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రుద్రవినాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. రైతులు ముందుకు వచ్చి పంటను సాగు చేయాలని చెప్పారు. ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధి ఐజాక్, రైతులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న ఉద్యాన శాఖ డివిజన్ అధికారి రుద్రవినాయక్, రైతులు

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

ముప్కాల్, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని భారాస మండల అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి అన్నారు. కొత్తపల్లిలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేయిరోజుల పాలనలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ భారాస ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమం చేయనున్నట్లు చెప్పారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నర్సారెడ్డి

పౌర హక్కుల దినోత్సవం

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండలో పౌర హక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎస్సీ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో సర్పంచి రాజేష్ మాట్లాడుతూ అందరూ కలిసి జీవించాలన్నారు. సాంఘిక సంక్షేమ అధికారి సరేష్, ఆర్ఐ గంగాధర్, జీపీవో రాజేష్, పంచాయతీ కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్ ఆత్మహత్య

మెండోరా: నెహ్రూనగర్‌లో రాజు(35) అనే టిప్పర్ డ్రైవర్ సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై సుహాసిని తెలిపారు. మద్యానికి బానిసై ఇంట్లో ఉరేసుకున్నాడని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

భీమ్‌గల్, న్యూస్‌టుడే: సుదర్శన్‌నగర్ తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు అనంత రావు, సర్పంచి వసందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాధ్యం

వేల్పూర్, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం వేల్పూర్‌లో లావణ్య, భువనేశ్వర్ ఇందిరమ గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రానున్న రోజుల్లో అందరికీ ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నల్లరాజు, మండల కన్వీనర్ రంగు అనిల్‌గౌడ్, నాయకులు రాజేందర్, రమణ, నరేందర్, దామోదర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మోసం చేసిన కేసులో ఒకరి అరెస్టు

వేల్పూర్, న్యూస్‌టుడే: విదేశాల్లో విద్య, ఉద్యోగాల పేరిట మోసం చేసి పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వేల్పూర్ ఎస్సై సంజీవ్ తెలిపారు. వేల్పూర్ మండలం జాన్కంపేట్‌కు చెందిన కొలిప్యాక ప్రవీణ్ 2023లో విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న ప్రవీణ్‌ను నమ్మదగిన సమాచారంతో అరెస్టు చేశారు. ఆర్మూర్ కోర్టులో హాజరుపరిచారు.

నిర్మల్‌కు బస్సును పునరుద్ధరించండి

ఏర్గట్ల, న్యూస్‌టుడే: మెట్‌పల్లి నుంచి ఇబ్రహీంపట్నం, వర్షకొండ, ఏర్గట్ల, తాళ్లరాంపూర్, తడపాకల్, బట్టాపూర్ మీదుగా నిర్మల్ వరకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ బట్టాపూర్ సర్పంచి ప్రవీణ్ యాదవ్, ఉప సర్పంచి దయానంద్, వీడీసీ సభ్యులు సోమవారం డిపో మేనేజర్ హరిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..గతంలో బస్సు నడిచిందన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు వేణు గౌడ్, నర్సయ్య యాదవ్, ముత్తెన్న పాల్గొన్నారు.

డీఎం హరికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాయతీని చాటుకున్న ఆటోడ్రైవర్

బాల్కొండ, న్యూస్‌టుడే: వన్నెల్(బి)కి చెందిన ఆటోడ్రైవర్ సయ్యద్ ఇస్మాయిల్ తన నిజాయతీని చాటుకున్నారు. చిట్టాపూర్ బస్టాండు వద్ద రహదారిపై చరవాణి ఆదివారం రాత్రి లభించగా, సోమవారం ఉదయం ఎస్ఐ శైలేందర్‌కు అందజేశారు. చరవాణిని పోగొట్టుకున్న వ్యక్తిని గుర్తించి స్టేషన్‌కు పిలిపించారు. ఇస్మాయిల్ చేతుల మీదుగా సెల్‌ఫోన్ అప్పగించారు.

విద్యార్థి దశ కీలకం

బాల్కొండ, న్యూస్‌టుడే: భవిష్యత్తుకు విద్యార్థి దశ ఎంతో కీలకమైందని ఎస్ఐ శైలేందర్ అన్నారు. బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ప్రిన్సిపల్ రజియొద్దీన్ అస్లాం ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఎస్ఐ శైలేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. స్టూడెంట్ కౌన్సిలర్ రాజేష్, ఎన్ఎస్ఎస్ అధికారి మురళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శైలేందర్

సమాజసేవలో భాగస్వామ్యం కావాలి

వేల్పూర్, న్యూస్‌టుడే : ఎంపీడీవోగా నిత్యం ప్రజలతో మమేకమైన బాలకృష్ణ పదవీవిరమణ అనంతరం కుటుంబానికి సమయాన్ని ఇస్తూనే సమాజసేవలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కోరారు. సోమవారం వేల్పూర్ జరిగిన ఎంపీడీవో బాలకృష్ణ పదవీవిరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీవో దంపతులను సన్మానించారు.

ఎంపీడీవో బాలకృష్ణ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పేదలకు అండగా సర్కారు

భీమ్‌గల్ న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భీమ్‌గల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగమణి పేర్కొన్నారు. భీమ్‌గల్ పురపాలిక పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు సోమవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. కమిషనర్ గజానంద్, కౌన్సిలర్లు సతీష్, నీలం రవి, అంజుమ్‌అలీ, నాయకులు స్వామి, నర్సయ్య, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్ నాగమణి

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని వినతి

నందిపేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అర్హులైన వారందరికీ చేయూత పింఛన్లు ఇవ్వాలని రైతు కూలీ సంఘం నాయకుడు గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీలకు పింఛను ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. దానిని అమలు చేయడం లేదన్నారు.

మండల అధ్యక్షులుగా నియామకం

మోర్తాడ్, న్యూస్‌టుడే: మోర్తాడ్ మండల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షులుగా సుమన్, మురళిని జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ సోమవారం నియమించారు. కార్యక్రమంలో యాదగిరి, భీమేశ్వరం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అభ్యున్నతి సాధించాలి

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ మండల సమాఖ్య 19వ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. సర్పంచి వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడుతూ... మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలన్నారు. అనంతరం ఎన్నికల అధికారి ప్రసాద్ మండల సమాఖ్య పాలకవర్గం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా శ్రీకన్య, కార్యదర్శిగా అక్బరి, కోశాధికారిగా సుమలత ఎన్నికయ్యారు. ఏపీఎం ఉమాకిరణ్, కోఆర్డినేటర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచి వెంకటేశ్వర్‌రావు

(c) eenadu